క్లుప్తంగా

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ ఆదర్శ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. వీటితో పాటు 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. ఈనెల 12 నుంచి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7 నిర్వహించబడుతుందన్నారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు బంద్

ఇంద్రవెల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 12 నుంచి 16 వరకు మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించి సీసీఐ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలని కోరారు. ఈనెల 17న పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు.

కుమారి వీడీసీ అధ్యక్షుడిగా శ్రీనివాస్

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామానికి చెందిన వీడీసీ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొట్టవతి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కూన నడిపెన్న, కోశాధికారిగా చంద్ర సొంరాక్, రైటర్‌గా బిక్క రమేశ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కుమారి సర్పంచ్ రాజు యాదవ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్ధాన్ కార్యవర్గం ఎన్నిక

బేల: మండల కేంద్రంలోని శ్రీరామ మందిరం కమ్యూనిటీ హాల్‌లో గురువారం మండల ఆదివాసీ పర్ధాన్ హక్కుల పోరాట సంఘం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నైతం సీతరాం, ఉపాధ్యక్షుడిగా పుసాం రాజేశ్వర్, గౌరవ అధ్యక్షుడిగా మెస్రం భరత్, ఉపాధ్యక్షుడిగా కనక సంజయ్‌తో పాటు మరో పది మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు ఉర్వతే మనోహర్, కిశోర్, నైతం పురుషోత్తం, మెస్రం వాసుదేవ్, సచిన్, పుసాం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

'అధైర్య పడొద్దు.. అండగా ఉంటా'

నేరడిగొండ: అధైర్యపడొద్దని.. అండగా ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇటీవలే విద్యుత్ షాక్‌కు గురైన మండలంలోని రాజురా గ్రామానికి చెందిన రాథోడ్ దయరామ్‌ను పరామర్శించారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆపదలో ఉన్న కార్యకర్తలను ఆదుకునేందుకు ముందుంటానని భరోసానిచ్చారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

ఇంటిబాట పట్టిన విద్యార్థులు



హాస్టల్ నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

ఉట్నూర్‌రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యాలయాలకు ఈ నెల 12 నుంచి 17 వరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో హాస్టల్ విద్యార్థులు ఇంటిబాట పట్టారు. గురువారం ఆయా వసతి గృహాల వద్ద విద్యార్థులు తల్లిదండ్రులు వచ్చి తమపిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. మరో వైపు బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఉట్నూర్ గిరిజన బాలికల వసతి గృహం విద్యార్థినులు ఇలా ఆటోల్లో ఇంటిబాట పట్టారు. ఈనెల 18 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

రేషన్ దుకాణాల తనిఖీ

బోథ్: బోథ్, సొనాలలోని రేషన్ దుకాణాలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా స్టాక్, రికార్డులను పరిశీలించారు. ప్రతి లబ్ధిదారుడికి రేషన్ అందించాలన్నారు. ఈ-కేవైసీని పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్యాంసుందర్, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎస్‌ఈ సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. పాత హౌజింగ్ బోర్డు, టీచర్స్ కాలనీ, కలెక్టర్ చౌక్, సంజయ్‌నగర్, సప్తగిరి కాలనీ, రిమ్స్ ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తీరనున్న రోడ్డు కష్టాలు

- మూడేళ్ల క్రితమే నిధులు మంజూరు
- ఇటీవల ప్రారంభమైన పనులు



సర్వీస్ రోడ్డు విస్తరణ కోసం జరుగుతున్న పనులు



అండర్ బ్రిడ్జి నిర్మించే స్థలం ఇదే..

గుడిహత్నూర్: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఆయా గ్రామాల్లో ప్రజల రాకపోకలు సాగించేందుకు ఇరువైపులా సర్వీసు రోడ్లతో పాటు అవసరమైన చోట అండర్ మ్యాన్ పాస్, అండర్ వెహికల్ పాస్‌లు నిర్మించాలి. కాని నిర్మాణ లోపాల వల్ల మండల కేంద్రంలో పూర్తిస్థాయిలో ఈపనులు చేపట్టక పోవడంతో మండల వాసులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

గతంలో నామమాత్రంగా సర్వీస్‌రోడ్లు..

మండలంలో జాతీయ రహదారి విస్తరణ పనులు 2009లో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా దేవాపూర్ చెక్ పోస్టు నుంచి మన్నూర్ సమీపంలోని గాంధీనగర్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. గ్రామం మధ్యలో నుంచి జాతీయ రహదారి వెళ్లడం వల్ల అవతలి వారు ఇటు వైపు వచ్చేందుకు అండర్ మ్యాన్ పాస్, వాహనాలు వెళ్లేందుకు అండర్ వెహికల్ పాస్ బ్రిడ్జిలు, సిటీ లైటింగ్ సిస్టం నిర్మించాలి. దీంతో పాటు గ్రామంలోని వాహనదారులు రాకపోకలు సాగించేందుకు జాతీయ రహదారిపై విశాలమైన సర్వీసు రోడ్లు నిర్మించాలి. హైవే అథారిటీ వారు నిర్మాణానికి మునుపు ఈవిధంగా ప్రతిపాదనలు తయారు చేశారు. కానీ మండల కేంద్రం నుంచి డొంగర్‌గావ్ వరకు చేపట్టాల్సిన పనులు ప్రతిపాదనల ప్రకారం చేపట్టక పోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని నేరడిగొండ, నిర్మల్ ఆ తర్వాత చేపట్టిన జాతీయ రహదారి పనుల్లో ప్రతీ గ్రామంలో సర్వీసు రోడ్లు, విలేజ్ లైటింగ్ సిస్టం మనకు కనిపిస్తాయి. కానీ ఇక్కడ పనులు చేపట్టిన సోమా ఎంటర్ ప్రైజెస్ సంస్థ ఎక్కడా కూడా విలేజ్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయక పోగా సర్వీసు రోడ్లను నామమాత్రంగా నిర్మించింది. వెహికల్ అండర్‌పాస్ నిర్మించక పోవడంతో పలు ప్రమాదాలు జరిగి అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.

కొనసాగుతున్న పనులు

మండల కేంద్రం నుంచి డొంగర్‌గావ్ వద్ద గల కొల్హారీ రోడ్డు వరకు సర్వీసు రోడ్డు నిర్మించాల్సి ఉన్నా.. ఆ దిశగా నిర్మాణ పనులు జరగలేదు. కేవలం మండల కేంద్రంలోనే ఇరుకైన సర్వీసు రోడ్లు నిర్మించి వదిలేశారు. దీంతో స్థానిక బస్టాండ్ రావాల్సిన బస్సులు, భారీ వాహనాలు రోడ్డు దాటేందుకు నిర్మించాల్సిన అండర్‌వెహికల్ పాస్ నిర్మించలేదు. గతంలో బస్టాండ్ వద్దనే బస్సులు, ఇతర వాహనాలు అడ్డంగా మలుపు తిరిగేవి వీటికి వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగేవి. చాలాసార్లు యూవీపీ నిర్మించి నిర్మాణ లోపాలను సరి చేయాలని స్థానికులు రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టారు. నాషనల్ హైవే అథారిటీ వారు అనేకసార్లు సర్వేలు చేసి ఎట్టకేలకు మూడేళ్ల క్రితం రూ.21 కోట్లు మంజూరు చేస్తూ మండల కేంద్రంతో పాటు పలుచోట్ల పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో గత వర్షాకాలంలో కాంట్రాక్టు పొందిన సంస్థ ఇటీవల పనులు చేపట్టింది. సబ్‌స్టేషన్ వద్ద అండర్ వెహికల్ పాస్ నిర్మిస్తోంది. అదే విధంగా డొంగర్‌గావ్ వరకు హైవేకు ఇరువైపులా విశాలమైన సర్వీసు రోడ్లు నిర్మించే పనులు చేపడుతోంది. మండలవాసుల రోడ్డు కష్టాలు తీరనున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లైటింగ్ ఏర్పాటు చేయాలి

ఇతర జిల్లాలో చేపట్టినట్లుగా మండల కేంద్రంలో సర్వీసు రోడ్ల వెంబడి విలేజ్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ప్రారంభమైన పనులు ఆగకుండా నిరంతరం కొనసాగించి పూర్తి చేయాలి. సర్వీసు రోడ్లను నిర్మించి కబ్జా చేయకుండా రెయిలింగ్ ఏర్పాటు చేయాలి.
– ప్రతాప్ రాథోడ్, మాజీ సర్పంచ్, మచ్చాపూర్

ఆధ్యాత్మికతతోనే నిస్వార్థ ప్రజాసేవ

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్: ఆధ్యాత్మికతను అలవర్చుకుంటేనే నిస్వార్థ ప్రజాసేవ చేయగలమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయ కేంద్రంలో గురువారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వాహకురాలు రేవతి బేహన్ ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి రాజకీయ నాయకులకు ఆధ్యాత్మికత ఎంతో దోహద పడుతుందన్నారు. ప్రజలందరి ఆశీస్సులే తనను గెలిపించాయని తెలిపారు. ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఆదినాథ్, జోగురవి, లాలామున్న, వేదవ్యాస్, రాము, అరుణ్, రాంనాథ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సమస్యలను విస్మరించిందని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు లక్ష్మారెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

22న సెలవు దినంగా ప్రకటించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సమితి ప్రతినిధులు

కైలాస్‌నగర్: అయోధ్య రామమందిర ఆలయం ప్రారంభోత్సవం, శ్రీ బాలరాముని ప్రాణప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా ఈనెల 22న సెలవు దినంగా ప్రకటించాలని సనాతన హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీతారాముల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా పల్లె, పట్టణమనే తేడా లేకుండా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో కూడా వేడుకలను అధికారికంగా నిర్వహించి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటాలన్నారు. వేడుకల్లో పాల్గొనేందుకు వీలుగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు సెలవు దినంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్, మాధవ్, నర్సాగౌడ్, సూర్యకాంత్, రవీందర్, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న అధికారులు

ఇచ్చోడ: బడీడు ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో మేకల సంత పరిసరా ప్రాంతంలో నివాసముంటూ.. భిక్షటన చేస్తున్న కుటుంబాల పిల్లలను గుర్తించి వారిని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఆపరేషన్ స్మైల్ 10లో భాగంగా పోలీస్ ఐసీడీఎస్, చైల్డ్ హెల్ప్‌లైన్ బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా పలు ప్రాంతాల్లో పర్యటించి బడీడు పిల్లలను గుర్తించి వారి కుటుంబాలతో మాట్లాడారు. 8 మంది బాల బాలికలను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమారాణి, కార్మికశాఖ సిబ్బంది మమత, హెడ్ కానిస్టేబుల్ అశోక్, ,సుదర్శన్, సుగుణ, అలీం, బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ రవికాంత్, రాకేశ్ పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

బోథ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, నాగబూషణం పాఠశాలలో గురువారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. మోడల్ స్కూల్‌లో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల క్రీడ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నాగబూషణం పాఠశాలలో విద్యార్థులు స్వామి వివేకానంద వేశాధారణలో ఆకట్టుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమేష్ రావు, పోటీ పరీక్షల నిపుణులు రమణ గౌడ్, సాయికృష్ణ, అనిల్, అబ్దుల్, అరవింద్, మణికంఠ, నాగబూషణం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కిశోర్, రచన, తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న పోరాటం చిరస్మరణీయం

ఆదిలాబాద్: భారత స్వాతంత్రోద్యమ వీరుడు వడ్డే ఓబన్న పోరాటం చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఆయన జయంతి వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం తమ జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. వడ్డే ఓబన్న విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేయడం గొప్ప విషయమన్నారు. చేతి వృత్తిదారులు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆడ సర్పంచ్ పాయల్ శరత్, తదితరులు పాల్గొన్నారు.

పూసాయిలో బోనాల సందడి

జైనథ్: మండలంలోని పూసాయి గ్రామంలో గ్రామస్తులు బోనాలు సమర్పించారు. పుష్య మాసం అమావాస్య సందర్భంగా గ్రామస్తులంత రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ ఇంటి నుంచి అమ్మవారికి నైవేద్యాలు వండుకొని, గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. డప్పువాయిద్యాల నడుమ మహిళలు మంగళహారతులతో శోభాయాత్రలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి, బోనాలు సమర్పించారు. నెల రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థి దశ అత్యంత కీలకమైంది

జైనథ్: విద్యార్థి దశ అత్యంత కీలకమైందని రిటైర్డ్ లెక్చరర్ సల్ల విజయ్ బాబు అన్నారు. గురువారం మండలంలోని పిప్పర్‌వాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, పదో తరగతి పరీక్షల్లో మెలుకువలపై తరగతులు నిర్వహించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందించారు. ఆయన వెంట రిటైర్డ్ లెక్చరర్ ఘన్‌రాజ్ గౌడ్, సర్పంచ్ నోముల సంతోష్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శశికళ, తదితరులు పాల్గొన్నారు.

నిత్య పూజలతోనే మానసిక ప్రశాంతత

నేరడిగొండ: ప్రతిరోజు పూజ కార్యక్రమాలు చేపట్టడంతో దైవచింతన, మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురుకృప దివస్‌ను పురస్కరించుకుని మండలంలోని రోల్‌మామడ గ్రామ పరిధిలోని గురుబాబ మందిరాన్ని గురువారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఎంపీపీ సజన్ రాథోడ్, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, ప్రతాప్ నాయక్, అజబ్ సింగ్ కారోబారి, సాబ్లే నానక్ సింగ్, ప్రతాప్ సింగ్, సరిచంద్, గులాబ్ సింగ్, సర్పంచ్ గీత కరణ్ సింగ్ పాల్గొన్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: లయన్స్ క్లబ్ రాష్ట్ర నూతన గవర్నర్‌గా ఎన్నికైన హన్మాండ్ల రాజిరెడ్డిని ఆదిలాబాద్ జిల్లా లయన్స్ క్లబ్ సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని లయన్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మాన పత్రం అందజేసి అభినందనలు తెలిపారు. సభ్యులు సామ రాజేంద్ర ప్రసాద్, నారాయణ రావు, రమాకాంత్, రాంరెడ్డి, శ్రీనివాస్, గంగయ్య పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబురాలు



తలమడుగు: ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



తాంసి: భీంపూర్‌లో గాలిపటాలతో విద్యార్థులు



నేరడిగొండ: వేడుకలో పాల్గొన్న చిన్నారులు

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. విద్యార్థులు గాలిపటాలు ఎగురవేసి సందడిగా గడిపారు. తాంసి, భీంపూర్, పిప్పల్‌కోటి, అంతర్గాం పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు శిల్ప, శ్రీకాంత్, దివ్య, ఉపాధ్యాయులు శంకర్, శివారెడ్డి, పవన్ పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని కజ్జర్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తుగా సంక్రాంతి సంబురాలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేశారు. ఒకరికొకరు సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు గాలిపటాలు ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్యోతి, ఉపాధ్యాయులు లలిత, రాజు, నగేష్, చిన్నయ్య, సంతోషి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఉండడంతో ముందస్తుగానే మహిళ ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఈ వేడుకలు నిర్వహించారు. మండలంలోని టీడబ్ల్యూపీఎస్ దేవులతండా, ఎంపీపీఎస్ రాజురా గ్రామాల్లోని పాఠశాలల్లో రంగు రంగుల ముగ్గులు వేశారు.

ఏజెన్సీ అభివృద్ధికి ప్రత్యేక కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేద ప్రజలకు అండగా ఉంటానని, ఏజెన్సీలో విద్య, వైద్యం మెరుగు పరిచేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, ఎంపీటీసీ పరమేశ్వర్, పీసా కోఆర్డినేటర్ సికేందర్ రాథోడ్, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతరావు దుర్గే, నర్సింగ్ మోరే, దుర్గే మహేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కాంగ్రెస్ జిల్లా నాయకులు ఉట్నూర్‌లో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. పలు అంశాలపై చర్చించారు. ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేశ్, దుర్గా నగర్ కాంగ్రెస్ వార్డు ప్రెసిడెంట్ లింగన్న, మోతీరాం, అలీం, మహేందర్, అబ్దుల్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉట్నూర్‌రూరల్: టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేతుల మీదుగా ఆవిష్కరించారు. బుధవారం రాత్రి జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో నిర్వహించిన హైమన్ డార్ఫ్ వర్ధంతి సందర్భంగా విచ్చేసిన మంత్రి, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో క్యాలెండర్లను ఆవిష్కరించడం జరిగిందని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సభ్యులు ఆత్రం సుగుణ, కనక వెంకటేశ్వరరావు, జ్ఞానేశ్వర్, గంగాసాగర్, భీంరావు, జ్యోత్స్న, లత, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున ఆదిలాబాద్ నియోజకవర్గ అభ్యర్థిగా పరిశ్రమల శాఖ రిటైర్డ్ జనరల్ మేనేజర్, కాంగ్రెస్ నాయకులు జాదవ్ రాంకిషన్ నాయక్ తనకు మద్దతు తెలపాలని కోరుతూ ఆయన గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా బయోడేటా అందించారు. నాయకులు లక్ష్మికాంత్, దామెర కనకరావు, కౌసర్, పాల్గొన్నారు.

శిక్షణ కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు అశోక్

ఎదులాపురం: శ్రీషిరిడి సాయి సేవా సొసైటీ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కోర్సులను నిర్వహిస్తున్నట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు దెబ్బడి అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో గల దాసాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బేసిక్ కంప్యూటర్స్, స్క్రీన్ ప్రింటింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బోథ్: మండలంలోని పార్డి(బి) గ్రామంలో సీసీరోడ్డు పనులను సర్పంచ్ మారుతి గురువారం ప్రారంభించారు. ఎంపీ సోయం బాపూరావ్ కేటాయించిన రూ. 2 లక్షల 50 వేల నిధులతో రోడ్డు పనులను ప్రారంభించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ పటేల్, బండు, పటేల్, గంగాధర్, భూమన్న, బాపూరావ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు..

రౌండ్ టేబుల్ సమావేశం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, లంకా రాఘవులు ఒక ప్రకటలో తెలిపారు. మోదీ ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు ఆధార్ లింక్ ఉపసంహరించుకోవాలని అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని వనవాసీ కల్యాణ పరిషత్ మడావి తుకారాం స్మారక కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థులకు ఈనెల 12న సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు వినాయక్ చౌక్‌లోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో నిర్వహించే కార్యక్రమానికి సోమయాజులు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లుగా పేర్కొన్నారు.

అలిశెట్టి ప్రభాకర్ వర్ధంతి

ఆదిలాబాద్: ప్రముఖ ప్రజాకవి అలిశెట్టి ప్రభాకర్ వర్ధంతిని శుక్రవారం అలిశెట్టి యాదిలో పేరిట నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు బాలసాని నారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాయంత్రం 5గంటలకు వర్ధంతి కార్యక్రమం ఉంటుందన్నారు. కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు, కళాకారులందరూ హాజరు కావాలని కోరారు.

సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్

ఆదిలాబాద్‌టౌన్: సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి అన్నారు. గురువారం పట్టణంలోని అరుణోదయ పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల చట్టం, పోక్సో, సైబర్‌క్రైమ్, స్మార్ట్ ఫోన్ వాడడంతో కలిగే నష్టాలు, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన హెల్ప్ లైన్, సఖీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలను వివరించారు. ఎవరైనా పోకిరీలు వేధిస్తే 181, డయల్ 100, 1098, 1930 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం సిబ్బంది నాగమణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.